క్లుప్తంగా

గ్రామ సర్వీస్ ట్రస్ట్ సహకారంతో వంతెనకు మరమ్మతులు



పమిడిముక్కల: పెనుమత్స గ్రామంలోని మొవ్వ రోడ్డులో పెద్ద కాలువపై వంతెన దెబ్బ తింది. రైతుల కోరిక మేరకు పెనుమత్స గ్రామ సర్వీస్ ట్రస్ట్ రూ.36 వేలు ఖర్చు చేసి వంతెనకు మరమ్మతులు చేయించారు. సర్వీస్ ట్రస్ట్‌కు రైతులు, కౌలుదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన అమ్మవారి సంబరాలు



పమిడిముక్కల: మేడూరు శివారు ధూళిపూడి పాలెంలో రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్న కాసాని వారి ఇలవేల్పు అమలేశ్వరమ్మ తల్లి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. కాసాని వంశస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

మొవ్వలో అంకమ్మతల్లి సంబరాలు



మొవ్వ: మండల కేంద్రమైన మొవ్వలో రెండు రోజులుగా జరుగుతున్న తాతినేని వంశీయుల ఆరాధ్యం అంకమ్మ తల్లి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సంబరాలకు రెండు తెలుగు రాష్ట్రాలలో స్థిరపడిన తాతినేని వారు, ఇంటి ఆడపడుచులు గ్రామానికి తరలిరావటంతో గ్రామంలో పండుగ వాతావరణం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా దేవాలయం నుంచి పుట్టింటికి వచ్చిన అమ్మవారి(ఘటం)ని పోతురాజు గెడతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకునేందుకు వంశీకులు పెద్ద ఎత్తున కోళ్లు, మేకలతో అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గోసేవ దుకాణంలో అగ్ని ప్రమాదం



పెనమలూరు: పోరంకి తూముల సెంటర్‌లో ఉన్న గోసేవ దుకాణంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. గో ఆధారిత ఉత్పత్తులు, సేంద్రీయ కూరగాయలు, ఇతర ఉత్పత్తుల అమ్మకాలు చేసే గోసేవా దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. దీంతో దుకాణం నుంచి మంటలు, దట్టమైన పొగ వచ్చింది. ఇది గమనించిన నిర్వాహకులు దుకాణంలో ఉన్న గ్యాస్ బండలను వెంటనే బయటకు తీసుకువచ్చారు. విజయవాడ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. సకాలంలో మంటలు అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ప్రమాదకరంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో రామాలయం వద్ద గన్నవరం – పుట్టగుంట ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు నుంచి పాత రోడ్డుకు అనుసంధానించే ప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రహదారి పూర్తిగా రాళ్లు తేలిపోయింది. వర్షాలు కురిసినప్పుడు మోకాలి లోతున నీరు నిలుస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణలో భాగంగా దావాజీగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. రామాలయం నుంచి గన్నవరం వరకు రెండో దశలో చేపట్టాల్సిన విస్తరణ పనులు 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రహదారి విస్తరణను పట్టించుకోవడం లేదు. దీంతో రామాలయం నుంచి పాత రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. కనీసం గుంతలు కూడా పూడ్చకపోవడంతో తరుచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- వేసవిలో చోరీలతో బహుపరాక్
- దడ పుట్టిస్తున్న చోరీలు
- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దొంగతనాలకు చెక్



చోరీకి గురైన ఇంట్లో చెల్లాచెదురుగా పడవేసిన వస్తువులు (ఫైల్)

గుడ్లవల్లేరు: వేసవిలో పిల్లలకు సెలవులు వచ్చాయంటే...పెళ్లిళ్లకు...పండగలకు ఊరెళ్తున్నారా... ఇంటిల్లపాదీ విహార యాత్రలకు వెళ్తున్నారా... తస్మాత్ జాగ్రత్త....మీ ప్రయాణమే వరం అన్నట్లుగా తాళం పడితే చాలు దొంగలు ఇళ్లకు కన్నం వేసేస్తారు. రాత్రి పూటే కాదు... పట్ట పగలే దొంగతనాలకు తెగబడుతూ.. దాచుకున్న డబ్బులు, బంగారు ఆభరణాలను క్షణాల్లో దోచుకెళ్తారు. ఇంటిల్లపాదీ దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే ముందు తమ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే... దొంగతనాలకు చెక్ పెడతామని పోలీసులు అంటున్నారు. ప్రతి వేసవిలో వరుస చోరీలు పెరిగిపోతాయి. ఈ చోరీలను పరిశీలిస్తే చాలా వరకు ఇళ్లకు తాళాలు వేసిన ఉంటే.. బీరువాలనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. గతంలో రాత్రి సమయంలో తాళం వేసిన ఇంట్లో చోరీలు జరిగేవి. ఇప్పుడు పట్టపగలే తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు కొల్లగొడుతున్నారు. దొంగలు ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే తమ లక్ష్యం బీరువాపై పెడుతున్నారు. బంగారు ఆభరణాలు, నగదునే టార్గెట్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాల్సిన అవసరం ఉంది. బీరువాల్లో నగలు, నగదు ఉంచవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పోలీసులకు ముందస్తు సమాచారం..

సెలవుల్లో వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసేవారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం చేరవేయాలి. వేసవిలో ఉక్కపోతతో ఇళ్లల్లో ఉన్న వారంతా ఆరుబయట నిద్రించేందుకు ఆసక్తి చూపుతారు. వీరంతా వారి ఇళ్లల్లో వీలైనంత మేరకు విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరిస్తే మంచిది. ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలి. స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించి ఎటువంటి సంఘటనలు జరిగినా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి.

ప్రజలు సహకరిస్తే చోరీలకు చెక్..

ఇంటర్ పరీక్షలు, పదో తరగతి పరీక్షలు ముగియడంతో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎక్కువగా ఇతర ఊళ్లకు వెళ్తున్నారు. ఏటా ఈ సమయంలోనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతే కాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పాటు ఆరు బయట నిద్రించే వారి ఇళ్లనే దొంగలు టార్గెట్ చేసుకొని ఆభరణాలు, డబ్బు కొల్లగొడుతున్నారు. అయితే ఇలాంటి దొంగతనాలు జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వేసవిలో జరిగే దొంగతనాలను చెక్ పెట్టేందుకు ప్రజల సహకారాన్ని కోరుతున్నారు.

మానిటరింగ్ అవసరం..

నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) అమలు కావటం లేదు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ అమలులోకి వస్తే దొంగతనాలను సులభంగా నివారించవచ్చు. స్మార్ట్‌ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారి పూర్తి వివరాలు పోలీస్ స్టేషన్ లేక పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరతాయి. ప్రయాణాలకు వెళ్లే ముందు రోజు ఆరు అంకెల కోడ్‌తో పోలీస్ రిక్వెస్ట్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ యాప్ అమలులోకి వస్తే నమోదు చేసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాలను అమర్చుతారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేస్తాం..



వేసవిలో ఊళ్లకు వెళ్లేవారు తమ బంగారు ఆభరణాలు, నగదును బీరువాల్లో ఉంచుకోరాదు. దొంగల టార్గెట్ బీరువాలపైనే ఎక్కువగా ఉంటుంది. ఈ విషయంపై ప్రజలకు ప్రతి చోట అవగాహన కల్పిస్తున్నాం. బంగారు ఆభరణాలు, నగదు బ్యాంకుల్లో లేదా ఇంట్లో ఇతర ప్రాంతాల్లో దాచుకోవాలి. విహార యాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేస్తాం. దీంతో దొంగతనాలు జరగకుండా నివారించవచ్చు.

– ఎన్‌వీవీ సత్యనారాయణ, గుడ్లవల్లేరు ఎస్‌ఐ

కొండలమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం



పొంగళ్లు వండుతున్న మహిళలు



జడ్జి గాయత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో అమ్మవారి దర్శనానికి భక్తులు అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. ఆదివారం భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తిప్రపత్తులతో చెల్లించుకునేందుకు బారులు తీరారు. దీంతో ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. పాల పొంగళ్లు పొంగించి, భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న జడ్జి..

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెను వేద పండితులు దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. తొలుత జడ్జి పేరిట అమ్మవారికి వేద పండితుడు రుద్రపాక శరశ్చంద్ర సంతోష్ ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా అంకమ్మతల్లి సంబరాలు



గరికపర్రులో అంకమ్మతల్లి

తోట్లవల్లూరు: గరికపర్రులో వీరంకి వారి అంకమ్మతల్లి సంబరాలు వైభవంగా ముగిశాయి. మొదటి రోజైన శనివారం గ్రామంలో పోతురాజు గెడను ఊరేగించగా, రెండో రోజైన ఆదివారం అమ్మవారికి మొక్కుబడుల చెల్లింపుతో సంబరాలు ముగిశాయి. తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి వీరంకి వంశీకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంకమతల్లిని దర్శించుకోవటంతో పాటు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ వీరంకి వెంకటేష్ గౌడ్, కమిటీ సభ్యులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

గుడివాడరూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు నడక, ప్రవర్తన కలిగిన వారు తమ ప్రవర్తనను, తీరును మార్చుకుని నేరాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో జీవించాలన్నారు. గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు, చెడునడక ఉన్న వ్యక్తులు నేరాలను వదిలాలని చెప్పారు. ప్రవర్తన మార్చుకోకపోతే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దొంగతనాలు, గొడవలు, మద్యం, మాదక ద్రవ్యాల అక్రమ విక్రయాలతో పాటు కోతముక్క, కోడి పందేలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముదినేపల్లి హైస్కూల్‌లో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

ముదినేపల్లిరూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సందడిగా జరిగింది. హైస్కూల్‌కు చెందిన 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాత అనుభవాలను నెమరవేసుకుని, ఆనందోత్సాహాలతో గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తు చేసుకొని సందడి చేశారు. హైస్కూల్ ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు వై.విజయకుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా ఉపాధ్యాయులు రామారావు, దుర్గాదేవి, రాంబాబు, సాయి, విజయలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

21 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో వేంచేసి యున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఉపాలయంలో ఈ నెల 21 నుంచి 23వ తేది వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ఎస్ రామాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న స్వామివారికి 108 లీటర్ల గోక్షీరం, పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, 41 కేజీల చందనంతో స్వామివారికి అలంకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. 22న హనుమజ్జయంతి సందర్భంగా 50 వేల తమలపాకులతో సహస్రనామార్చనలు జరపనున్నట్లు వివరించారు. 23న ఉదయం ఐదు గంటల నుంచి భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో గత మూడు రోజుల నుంచి అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో సమయంతో పని లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. అసలే ఎండ వేడి తట్టుకోలేకపోతున్న వృద్ధులు, చిన్నారులు ఈ విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా విద్యుత్ నిలిపివేస్తుండటంతో ఉక్కపోతకు గురి అవుతున్నారు. పగలు సమయంలో రెండు, మూడు గంటలు, అర్ధరాత్రి నుంచి ఉదయం నాలుగు గంటల వరకు విద్యుత్ నిలిచిపోతుందని ఫలితంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫోన్ చేసినా సరైన సమాధానం ఇవ్వడం లేదని చెబుతున్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కైకలూరు: విద్యా, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. సీఎం సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో ఆదివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి వైద్య ఖర్చులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. 9 మంది బాధితులకు రూ.6,75,987 విలువ చేసే చెక్కులను అందజేశారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



పోరంకిలో హెచ్‌ఐవీ నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, స్థానిక ప్రజలు

పెనమలూరు: హెచ్‌ఐవీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టామని పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మంజుల తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో గైడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోరంకిలో ఆదివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ హెచ్‌ఐవీ నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంతో మెలగాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధి వచ్చిన వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. గుడివాడకు చెందిన కల్చరల్ సొసైటీ కళాకారులు వీరయ్య బృందం ఎయిడ్స్‌పై వీధి నాటకం ప్రదర్శించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, గైడ్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ రావు, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

గుడివాడటౌన్: గుడివాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రగతి గార్డెన్స్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 45 మంది బాధితులకు వైద్యసేవలందించారు. గుండె, నరాల వైద్య విభాగానికి చెందిన ప్రముఖ వైద్యులు దేవి శశిరామ్, అభిషేక్, తరుణ్ కుమార్‌రెడ్డిలు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు టి.ఎస్.రాజశేఖర్, జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షులు సూర్యచంద్రరావు, బి.శంకరరావు, ఎం.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు అజయ్, శోభారాణి బృందం పరీక్షలు చేశారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 42 మందికి కళ్లజోళ్లు అవసరమయ్యాయని ఆరుగురికి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. ఉచిత ఆపరేషన్‌లను వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేసిందని, తక్కువ ధరకే కళ్లజోళ్లు అందజేస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శి డి.శ్రీనివాస్, కోశాధికారి టి.రామ్మోహన్, ఎల్ఈ వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ ఉన్నతిలో విశ్రాంత సైనికులు భాగస్వామ్యం కావాలి



విశ్రాంత సైనికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: దేశ సేవ చేసి రిటైరైన సైనికులు సమాజ ఉన్నతిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో పలువురు విశ్రాంత సైనికులు ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నా తండ్రి వెంకటేశ్వరరావు ఆర్మీలో పని చేశారని, ఆర్మీ కుటుంబం నుంచి వచ్చిన తనకు రిటైరైన తర్వాత వారి కష్టాలు తెలుసునన్నారు. దేశ రక్షణలో విశేష సేవలు అందించి, ధైర్యానికి ప్రతిరూపాలైన సైనికులను మనమందరం ప్రత్యేకంగా గౌరవించుకోవాలన్నారు. రిటైరైన సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. విశ్రాంత సైనికులు సమాజ ఉన్నతిలో భాగస్వాములు అయ్యేలా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీఎంను కోరతానన్నారు.సమావేశంలో పలువురు ఆర్మీ విశ్రాంత సైనికులు పాల్గొన్నారు.

సామూహిక పఠనంతో విషయ పరిజ్ఞానం



జమీగొల్వేపల్లిలో సామూహిక పఠనం చేస్తున్న విద్యార్థులు, పాఠకులు



పామర్రులో జీకేపై అవగాహన కల్పిస్తున్న అధికారి ఝాన్సీరాణి

జమీగొల్వేపల్లి(పామర్రు): జ్ఞాన సముపార్జనకు సరైన మార్గం గ్రంథ పఠనమని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ అన్నారు. మండల పరిధి జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోజూ పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానం సామాజిక స్పృహ కలుగుతుందన్నారు. గ్రంథాలయాల ఆవశ్యకతను చిన్నారుల తెలుసుకోవాలని చెప్పారు. గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రులో..

జనరల్ నాలెడ్జి నేర్చుకోవడం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం అవుతుందని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి పేర్కొన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో జీకేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మండవల్లిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

జనరల్ నాలెడ్జ్ సైన్స్‌పై అవగాహన

మండవల్లి: విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ సైన్స్‌పై ఆదివారం లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీనా అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పుస్తక పఠనంతో ప్రయోజనాలు వివరించారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రామవరప్పాడులో కార్డన్ సెర్చ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ దామోదర్ తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పీఎస్ఆర్ కాలనీ, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనాలు తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ఏసీపీ దామోదర్ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి, మద్యం సేవించి ఇబ్బందులకు గురి చేస్తే సమాచారం అందించాలని కోరారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లు, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఎవరైన అనుమానితులు సంచరించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ఇబ్బందులకు గురి చేసిన 112కు సమాచారం ఇవ్వాలని ఏసీపీ కోరారు. కార్యక్రమంలో పటమట సీఐ పవన్‌కిశోర్, మాచవరం సీఐ ప్రకాష్, గుణదల సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు హరికృష్ణ, కృష్ణవర్మ, రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.